క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ఎస్సై



ఐనవోలు: మండల నూతన ఎస్సైగా వంగాల నవీన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో దుగ్గొండి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన నవీన్‌కుమార్ ఐనవోలు పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై రాగా ఇక్కడ పని చేస్తున్న ఎస్సై గుగులోతు వెంకన్న ఇంతేజార్ గంజ్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నవీన్‌కుమార్‌ను పోలీస్ సిబ్బంది స్వాగతం

చర్య తీసుకోవాలి



ఆత్మకూరు: మండలంలోని కొత్తగట్టు, పెద్దాపూర్ శివార్లలో క్రషర్లు, క్వారీల యజమానులు పర్యావరణ అనుమతులు, ఇతర అనుమతులు లేకున్నా యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని వినియోగదారుల మండలి రాష్ట్ర అధ్యక్షుడు సాంబరాజు చక్రపాణి, సంయుక్త కార్యదర్శి చిలువేరు ప్రవీణ్ అన్నారు. హనుమకొండలోని మైనింగ్ కార్యాలయంలో బుధవారం కొత్తగట్టు, పెద్దాపూర్ గ్రామాలకు సంబంధించిన క్రషర్, క్వారీల అనుమతులు, రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్వారీ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

25 మందికి కు.ని. ఆపరేషన్లు



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కమలాపూర్: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం కుటుంబ నియంత్రణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా ఆధ్వర్యంలో 25 మంది పురుషులకు కోత, కుట్టు లేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసుకున్న ఒక్కొక్కరికి రూ.1,100 చొప్పున నగదు పారితోషికం అందించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ హర్షిణీప్రియ, సీహెచ్‌ఓ మాధవరెడ్డి, ఎంపీహెచ్‌ఓ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



శాయంపేట : హైదరాబాద్ వాతావరణ శాఖ సూచనల మేరకు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పత్తిపాక సర్పంచ్ చిట్టిరెడ్డి రాజిరెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యసరమైతేనే బయటికి రావాలని కోరారు. లోతట్టు ప్రాంతాలకు వెళ్లకూడదని, రైతులు తమ వ్యవసాయ పనులను త్వరగా ముగించుకొని ఇంటికి చేరుకోవాలని అన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు తడిసిన విద్యుత్ స్తంభాలను, వైర్లను ముట్టుకోవద్దని సూచించారు.

మొక్కలు నాటాలి



ఆత్మకూరు: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలని ఎంపీడీఓ, గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. హరితహారంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో గ్రామస్తులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలు మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇంటి ఆవరణంలోని ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి, ఉపసర్పంచ్ వంగాల స్వాతిభగవాన్‌రెడ్డి, వార్డు సభ్యులు రవీందర్, రేవూరి ప్రవీణ్‌రెడ్డి, రేవూరి శ్యామ్‌సుందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభూది అలంకరణలో అయ్యప్ప

కాజీపేట: అధిక శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా మొదటి బుధవారం కాజీపేట పట్టణంలోని అయ్యప్ప స్వామిని అర్చకులు విభూదితో అలంకరించి ప్రత్యేక అభిషేకం చేశారు. హరిహర పుత్రుడిని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు ఉడుతల శ్రీనివాస్ శర్మ భక్తులతో కలిసి విభూదితో అభిషేకం జరిపించారు. గురుస్వాములు బుర్ర జనార్దన్ గౌడ్, పురుషోత్తం రెడ్డి, అరూరి సాంబయ్య, విజయ్‌కుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘ఓపెన్’ గా చదివేద్దాం.. విద్యకు దగ్గరవుదాం

- ప్రారంభమైన ఓపెన్ పది, ఇంటర్ అడ్మిషన్లు
- ఆసక్తి చూపుతున్న విద్యార్థులు



ధర్మసాగర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల

ధర్మసాగర్: చదువుతోనే గౌరవం.. చదువుకుంటే జీవితం బంగారం.. చదువుని మళ్లీ కొనసాగిద్దాం సమాజంలో మనమూ గుర్తింపు పొందుదాం.. అనే నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ ఓపెన్ స్కూల్ (దూరవిద్యా) విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. విద్యతో విజ్ఞానం సంస్కారం లభిస్తుందని ప్రతీ ఒక్కరికి తెలిసిన ఆర్థిక, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా కొందరు చదువును మధ్యలో మానేసి, మరికొందరు పూర్తిగా చదువుకు దూరమైన వారితో పాటు ఆర్థిక సమస్యలతో చదువుకు దూరమైన ఆడపిల్లలకు ఓపెన్ స్కూళ్లు పునాదులుగా మారుతున్నాయి. విద్యకు దూరమైన వాళ్లు ఉపాధి కోసం ఏదో ఒక వృత్తిలో నెట్టుకొస్తున్నారు. ఇతర వృత్తిలో పనులు చేసుకుంటూనే విద్యను కొనసాగించే విధంగా ప్రభుత్వం ఓపెన్‌స్కూళ్లకు శ్రీకారం చుట్టింది. నిత్య జీవితానికి ఉపయోగపడేలా విద్య విషయక, వృత్తి విద్య సంబంధమైన కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో పదోతరగతి, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ప్రారంభం కాగా అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. చదవడం, రాయడం తెలిసి 14ఏళ్లు నిండిన వారందరికీ దూర విద్య విధానంలో ప్రవేశాలు కల్పిస్తున్నారు.

ఫీజులు ఎంతంటే..

పదో తరగతి జనరల్ కేటగిరీకి సంబంధించి పురుషుల ప్రవేశ రుసుం రూ. 1,450తో పాటు దరఖాస్తు రుసుం రూ. 100 కలిపి మొత్తం రూ. 1,550 చెల్లించాల్సి ఉంటుంది. అదే విధంగా అన్ని కేటగిరీలకు సంబంధించిన మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ దివ్యాంగుల కేటగిరీల పురుషులకు రూ. 1,150, ఇంటర్ జనరల్ కేటగిరీకి చెందిన పురుషులైతే రూ. 1,800 చెల్లించాలి. ఇతర కేటగిరీలకు చెందిన వారైతే రూ.1,500 చెల్లించాలి. అయితే అభ్యర్థులు సంబంధిత వెబ్‌సైట్‌లో ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ఆగస్టు 10వ తేదీ వరకు చెల్లించేందుకు వీలు ఉంది. అలాగే, గడువు దాటిన తర్వాత అపరాధ రుసుంతో ఆగస్టు 11నుంచి 31వ తేదీ వరకు ఫీజును చెల్లించేందుకు వేసులుబాటు కల్పించారు.

నచ్చిన సబ్జెక్టుల ఎంపిక

పదోతరగతి, ఇంటర్మీడియట్‌లను మూడు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ ఏ- భాషలు, గ్రూప్ బీ-భాషేతర విషయాలు, గ్రూప్- సీ లో వృత్తి విద్య కోర్సులు ఉంటాయి. అధ్యాపకులే స్వయంగా బోధన విషయాలను బోధిస్తారు. గ్రూప్- ఏ, బీల నుంచి కనీసం రెండు సబ్జెక్టుల చొప్పున మొత్తం ఐదు సబ్జెక్ట్ లు ఎంపిక చెసుకోవాల్సి ఉంటుంది. ఇంటర్మీడియట్‌లో గ్రూప్- ఏ లో భాషలు, గ్రూప్- బీ లో ఆప్షనల్స్, గ్రూప్ - సీ లో వృత్తి విద్య కోర్సులు ఉంటాయి. గ్రూప్- ఏ నుంచి ఇంగ్లిష్‌తో పాటు నచ్చిన భాషను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించారు. గ్రూప్- సీ లో తమకు నచ్చిన వృత్తి విద్య కోర్సును ఎంపిక చేసుకోవచ్చు. అడ్మిషన్లు పొందిన అభ్యర్థులందరికీ ఉచితంగా పుస్తకాలు అందిస్తారు. వారికి ప్రతీ ఆదివారం, రెండో శనివారం తరగతులు నిర్వహిస్తారు. సందేహాలను తగరతుల సమయంలో అధ్యాపకులు తీర్చుతారు. అయితే పదోతరగతిలో 20 మంది, ఇంటర్‌లో 25 మంది ఉంటే అధ్యయన కేంద్రంలో తరగతులు నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఓపెన్ స్కూల్ విద్యా విధానంలో ఇంటి వద్దనే ఉంటూ చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తుంది. చదువు మధ్యలో మానేసిన, పూర్తిగా చదువకు దూరంగా ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రెగ్యులర్ విద్యతో సమానంగా ఓపెన్ విద్యకు గుర్తింపు ఉంది. ఆసక్తి అర్హులైన అభ్యర్థులు నిర్లక్ష్యం చేయకుండా అడ్మిషన్లు పొందాలి.

\- ఎం.ఉమామహేశ్వర్, కోఆర్డినేటర్

కనీస ఫీజుతోనే ప్రవేశాలు



పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఓపెన్ స్కూల్ ప్రవేశాలను కనీస ఫీజుతోనే రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తుంది. వివిధ రకాల మాధ్యమాల్లో ఓపెన్ స్కూల్ విధానం నిర్వహిస్తున్నారు. విద్యార్హతను పెంచుకునేందుకు ఓపెన్ స్కూల్ చక్కటి అవకాశం. చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునే వారు సైతం ఓపెన్ స్కూల్‌లో చదివి ప్రమోషన్లు పొందుతున్నారు.

\- కేబీ ధర్మప్రకాశ్, అసిస్టెంట్ కో ఆర్డినేటర్

అర్హతలు..

ఓపెన్ స్కూల్ విద్యలో పదోతరగతిలో ప్రవేశం పొందేందుకు 2023 ఆగస్టు నాటికి 14 సంవత్సరాలు, ఇంటర్‌లో ప్రవేశం పొందేందుకు 15 సంవత్సరాలు నిండి ఉండాలి. ప్రవేశాలకు గరిష్ఠ పరిమితి లేదు. ఇంటర్‌లో చేరేందుకు పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. దరఖాస్తుతో పాటు వయస్సు ధ్రువీకరణ పత్రం అందజేయాల్సి ఉంటుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు ఆయా కేటగిరీలకు సంబంధించిన పత్రాలను జత చేయాల్సి ఉంటుంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్లు ప్రారంభం అయ్యారు.

నిధుల ఖర్చుపై విచారణ చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

ఎల్కతుర్తి: మండలంలోని దండేపల్లి గ్రామంలో ప్రభుత్వం నుంచి వచ్చిన నిధుల ఖర్చుపై సమగ్ర విచారణ చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దండేపల్లి గ్రామానికి ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు పక్కదారి పట్టాయని ఆరోపించారు. అభివృద్ధిలో మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైందని ఆరోపించారు. సైడ్ కాల్వలు, సీసీరోడ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా పనులను చేసి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల పర్యవేక్షణ లోపం వలన గ్రామ పంచాయతీ నిధుల నుంచి తడిచెత్త, పొడి చెత్త వేరు చేయడానికి ప్లాస్టిక్ బుట్టలు కొనుగోలు చేసి ఇళ్ల నుంచి చెత్త సేకరణ మరిచారని అన్నారు. దీంతో నిధులు వృథాగా ఖర్చు చేశారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి నిధుల ఖర్చులపై పూర్తి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు నిమ్మల మనోహర్, సహాయ కార్యదర్శి శనిగరం రాజ్‌కుమార్, కామెర లక్ష్మణ్, కృష్ణ, ఆ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కంపెనీ పెట్టొద్దని కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు: మండలంలోని కటాక్షపూర్‌లో ఓరుగల్లు బయోఫ్యూయెల్ కంపెనీ పెట్టొద్దని కోరుతూ కటాక్షపూర్ గ్రామస్తులు, స్థానిక సర్పంచ్ మచ్చిక యాదగిరిగౌడ్‌లు జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం హనుమకొండలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామంలో కంపెనీ ఏర్పాటు చేస్తే విషవాయువుతో ప్రజలకు ప్రాణహాని ఉంటుందని కలెక్టర్‌కు వివరించారు. కంపెనీ ఏర్పాటుకు గ్రామ ప్రజలు వ్యతిరేకిస్తున్నామని, గ్రామసభ తీర్మానం చేసినట్లు తెలిపారు. సర్పంచ్ మచ్చిక యాదగిరిగౌడ్, వార్డు సభ్యులు కుడుతాల రమేష్, ఒన్నాల భిక్షపతి, కొమ్మిడి మోహన్‌రెడ్డి, బాసిడి మహేందర్, ఎండి.గఫూర్, సిరంశెట్టి సుమన్, రాజునాయక్, ప్రశాంత్, శ్రీధర్, వెంకటేష్, సతీష్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు అండగా ఉంటా



బాబుమియాను పరామర్శిస్తున్న నాగుర్ల

ఆత్మకూరు: ఉద్యమకారులకు ఎల్లవేళలా అండగా ఉంటానని రైతురుణ విమోచన కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకన్న అన్నారు. మండలంలోని గుడెప్పాడ్‌లో ఉద్యమకారుడు బాబుమియాపై కొంతమంది దాడి చేసిన విషయాన్ని తెలుసుకున్న ఆయన బుధవారం బాబుమియాను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు సముచిత స్థానం ఉంటుందన్నారు. ఉద్యమకారుల సమస్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళతానన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యమకారులు అంకతి రవి, దొంకదువ్వ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్‌లో నూతన పరపతి సంఘం

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌లో నూతన పరపతి సంఘం ఏర్పాటు చేసుకోవడం వ్యాపారుల ఘన విజయమని జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి అన్నారు. మార్కెట్‌లో కోఆపరేటివ్ సొసైటీ ఏర్పాటు కోసం బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వందమంది ఒకే తాటిపైకి వచ్చిన పరపతి సంఘం ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగనారాయణ కోఆపరేటివ్ సొసైటీ గురించి పూర్తిగా వివరించి గొప్పగా ఎదగడానికి సభ్యులకు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం అధ్యక్షుడిగా బిట్ల కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అలీ, ఉపాధ్యక్షులుగా పాపని భాస్కర్, నమిండ్ల సూరయ్య, మురళి, కొండా హరితో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

‘పాలిటెక్నిక్’తో ఉజ్వల భవిష్యత్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి: పాలిటెక్నిక్‌తో ఉజ్వల భవిష్యత్ ఉందని, తమ కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతీ విద్యార్థి ఉపాధి పొందేలా తర్ఫీదు ఇచ్చి, ప్లేస్‌మెంట్‌తో పంపుతామని ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. పాలిటెక్నిక్‌లో ప్రవేశం పొందిన విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిరుపేదల విద్యార్థులకు ఫీజుల్లో రాయితీ కల్పిస్తామని చెప్పారు. సీటు రాని విద్యార్థులు నిరాశకు గురికాకుండా తమ కార్యాలయంలో సంప్రదిస్తే స్పాట్‌లో అవకాశం కల్పించడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఏకే.రాథోడ్, డాక్టర్ ఈవీ.రావు, డాక్టర్ రఘు, పలు విభాగాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

ఎల్కతుర్తి: నేడు (గురువారం) మండల కేంద్రంలోని కోతులనడుమ గ్రామానికి హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్‌లు పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు సమ్మయ్యగౌడ్ బుధవారం తెలిపారు. రైతు వేదికలో రైతులతో ముఖాముఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారని వెల్లడించారు.

చైతన్య వర్సిటీ సెమిస్టర్ ఫలితాల విడుదల

హన్మకొండ: హనుమకొండ నయీంనగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఎంబీఏ రెండవ సెమిస్టర్, బీటెక్, ఎంటెక్, ఎంఫార్మసీ నాలుగవ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు యూనివర్సిటీలో సెమిస్టర్ ఫలితాలను ఉప కులపతి ప్రొఫెసర్ జీ.దామోదర్ బుధవారం విడుదల చేశారు. ఎంబీఏ రెండవ సెమిస్టర్ పరీక్షల్లో 84.44 శాతం ఉత్తీర్ణత, బీటెక్, బీఫార్మసీ నాలుగవ సెమిస్టర్‌లో 62.34 శాతం, ఎంటెక్ (సీఎస్‌సీ) నాలుగవ సెమిస్టర్‌లో 100 శాతం ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం.రవీందర్, ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ ప్రొఫెసర్ జి.శంకర్ లింగం, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ వీ.మల్లికార్జున్, ఓఎస్‌డీ డాక్టర్ కే.వీర వెంకటయ్య, అడ్మినిస్ట్రేషన్ డీన్ ప్రొఫెసర్ ఎస్.కవిత, అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.సుమ, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.జగదీశ్వర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన ఏసీపీలు



వరంగల్ క్రైం: కాజీపేట, పరకాల, మామునూరు ఏసీపీలుగా నియమితులైన పి.డేవిడ్‌రాజు, కే.కిషోర్ కుమార్, సీ.సతీష్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

శ్వేతార్కలో అలారం సిస్టం

కాజీపేట: కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నూతన అలారం సిస్టాన్ని 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ బుధవారం ప్రారంభించారు. ఆలయ ఇన్‌చార్జ్ గంగుల రాజిరెడ్డి సహకారంతో ఆలయంలో ఏర్పాటు చేసిన అలారం గంటకొకసారి గంటలు మోగడంతో పాటు ప్రతీ గంటకు ఒక భగవద్గీత శ్లోకం చదివి దాన్ని అర్థాన్ని వివరిస్తుంది. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు పాల్గొన్నారు.

కేజీబీవీకి వరద ముప్పు



ఎల్కతుర్తి: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాల ఆవరణంలో వరద నీరు భారీగా చేరింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. ముందు జాగ్రత్త చర్యగా విద్యార్థులను మోడల్‌స్కూల్‌కు తరలించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అనితాదేవి తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వరద నీరు నిల్వ కాకుండా చూడాలని ఆమె కోరారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

నడికూడ: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రైతులకు, ప్రజలకు లబ్ధి జరుగుతుంటే ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని విమర్శించారు. తెలంగాణలో విద్యుత్ సరఫరాపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వాఖ్యలకు నిరసిస్తూ మండలంలోని రాయపర్తి, మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉచితాలు వద్దంటూ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సిగ్గుచేటన్నారు. బీజేపీ రైతుల మెటార్లకు మీటర్లు పెట్టాలంటే, మరోవైపు కాంగ్రెస్ 24 గంటల విద్యుత్ వద్దంటోందని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం రాయపర్తి, నడికూడలో కే.ఎస్.ఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలను, కోటి రూపాయలతో రాయపర్తి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మచ్చ అనసూర్య, జెడ్పీటీసీ కోడెపాక సుమలత, సర్పంచ్‌లు ఊర రవీందర్, రావుల సరిత, సదానందం, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుల డిమాండ్లు నెరవేర్చాలి



వర్షంలో సమ్మె కొనసాగిస్తున్న జీపీ కార్మికులు

కమలాపూర్: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఏఐటీయూసీ, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 14వ రోజుకు చేరుకోగా, జీపీ కార్మికులు కమలాపూర్‌లో వర్షంలోనూ తమ సమ్మె కొనసాగించారు. అనంతరం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలు పార్టీ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీపీ కార్మికులను పర్మనెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. 11వ పీఆర్సీ ప్రకారం కనీస వేతనం రూ.19 వేలు చెల్లించాలన్నారు. జీఓ 51ని సవరించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, జీపీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీపీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఇసంపెల్లి అయిలయ్య, ఉపాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రాజయ్య, జిల్లా నాయకులు మాట్ల భాస్కర్, అరుణ, ఎల్లస్వామి, ఏఐటీయూసీ, సీపీఐ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, జీపీ కార్మికులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు సక్రమంగా చేపట్టాలి



శిక్షణ కల్పిస్తున్న తహసీల్దార్ రియాజుద్దీన్



శిక్షణనిస్తున్న వెన్నం రవీందర్‌రెడ్డి

దామెర: ఓటరు నమోదు కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ రియాజుద్దీన్ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం బూత్ స్థాయి అధికారులకు (బీఎల్‌ఓ) ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. నూతన ఓటరు నమోదు, సవరణలు, మృతిచెందిన ఓటరును తొలగించడం, ఆన్‌లైన్ ఆప్ ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు 2023 అక్టోబర్ 1వ తేదీన నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. నూతన ఓటరు నమోదు కోసం ఫారం 6, మార్పులు చేర్పుల కోసం ఫామ్ 8ను ఆన్‌లైన్‌లో లేదా నేరుగా బీఎల్‌ఓలకు సమర్పించాలని వెల్లడించారు. నమోదు ప్రక్రియలో భాగంగా తప్పులు దొర్లకుండా చూడాలని సూచించారు. నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ రామక్రిష్ణ, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్(వేలేరు): మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో తహసీల్దార్ దేవులపల్లి సమ్మయ్య అధ్యక్షతన బూత్ లెవల్ ఆఫీసర్లకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మాస్టర్ ట్రైనర్ వెన్నం రవీందర్‌రెడ్డి బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లు సమ్మయ్య, రెహ్మాన్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బీమా గ్రామంగా మైలారం ఎంపిక



మంజూరు పత్రాన్ని అందజేస్తున్న చీఫ్ మేనేజర్

శాయంపేట : మండలంలోని మైలారం గ్రామాన్ని భారతీయ బీమా సంస్థ బీమా గ్రామంగా ఎంపిక చేసింది. ఈ మేరకు ఆ సంస్థ పరకాల చీఫ్ మేనేజర్ ఎం విశ్వనాథం రూ. 2 లక్షల మంజూరు పత్రాన్ని బుధవారం సర్పంచ్ అరికిళ్ల ప్రసాద్‌కు అందించారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ మాట్లాడుతూ మైలారం గ్రామ ప్రజలు అత్యధికంగా ఎల్ఐసీ పాలసీలు తీసుకున్నారని తెలిపారు. దీంతో గ్రామ అభివృద్ధి కోసం ఎల్ఐసీ సంస్థ నుంచి 2020-21, 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 2 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో కమ్యూనిటీ హాల్, మూత్రశాల, సోలార్ లైట్లు, చేతిపంపు, పాఠశాల విద్యార్థులకు ఫర్నిచర్‌లకు ఉపయోగిస్తామనని సర్పంచ్ తెలిపారు. రాబోయే రోజుల్లో ప్రతీ ఒక్కరు ఎల్ఐసీ పాలసీ తీసుకొని కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ ఏబీఎస్ అరుణ్‌విఎత్ర, ఉపసర్పంచ్ సునితసాంబరెడ్డి, ఎల్ఐసీ ఏజెంట్లు దూడిపాల బుచ్చిరెడ్డి, ఐలి శ్రీనివాస్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్గనిర్దేశకులుగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాంచంద్రం

కేయూ క్యాంపస్: విద్యార్థులు శాస్త్రీయ ప్రజాస్వామిక లక్షణాలను అలవర్చుకొని సామాజికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ సమాజ మార్గనిర్దేశకులుగా ఎదగాలని కాకతీయ యూనివర్సిటీ సీడీసీ డీన్, పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి ప్రొఫెసర్ రాంచంద్రం ఆకాంక్షించారు. కాకతీయ యూనివర్సిటీలోని పొలిటికల్ సైన్స్ విభాగం ‘ఫస్ట్ ఇయర్ విద్యార్థుల వెల్‌కమ్’ ‘సెకండ్ ఇయర్ విద్యార్థుల ఫేర్ వెల్ డే’ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ దేశంలో, ప్రపంచంలో జరుగుతున్న రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిణామాలను శాస్త్రీయంగా అంచనా వేయడంలో విశ్వవిద్యాలయాల విద్యార్థులు ముందుండాలని సూచించారు. కులం, మతం, స్త్రీ, పురుష వివక్ష, అసమానతలు లేని సమాజాన్ని ఏర్పాటు చేసుకోవలసిన బాధ్యత నేటి విద్యార్థి లోకం పైనే ఉందని గుర్తు చేశారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని కోరారు. చెడు మార్గాలకు వెళ్లకుండా అధ్యాపకులు, తల్లిదండ్రులు చెప్పిన మార్గంలో నడుచుకుంటే బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పొలిటికల్ సైన్స్ విభాగం కాంట్రాక్టు అధ్యాపకులు కృష్ణ,ఎ వెంకట్, సత్యనారాయణ, నాగరాజు, పరిశోధక విద్యార్థులు నరసింహారావు, మాదాసి రమేష్, తాళ్లపల్లి నరేష్, గుండేటి సుమన్, సురేష్, కవిత, అరుణ తదితరులు పాల్గొన్నారు.